క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట 14వ వార్డులో సీసీరోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్ భోగం సుగుణ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం దిశగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దయ్యాల శ్రీనివాస్, ఏఈ వరుణ, నాయకులు భోగం వెంకటేశ్, పంజాల అనిల్, ప్రేమ్, అంకూశ్, రవీందర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

హుజూరాబాద్: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ఫిన్నిడి పస్తాం, బిలీవర్స్ చర్చి ట్రస్ట్ నిర్వాహకుడు నవీన్‌కుమార్ అన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై శనివారం చర్చిలో అవగాహన కార్యకమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వర్షాకాలంలో నిల్వ నీటితో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధన సందపాదన కంటే ఆరోగ్య సంపద గొప్పదని, అందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నల్ల లక్ష్మి, నాయకులు సుమన్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



గ్రామస్తులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

జమ్మికుంట: మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాపక్కపల్లి, శాయంపేట గ్రామాల్లో డాక్టర్ కార్తీక్, విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 85 మందికి వైద్య పరీక్షలు చేసి తొమ్మిది మందిని జ్వరంబారినపడినట్టు గుర్తించి, రక్త నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు సదానందం, కుసుమకుమారి, ఏఎన్‌ఎంలు రమా, తిరుమల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సేఫ్టీ మోకుల శిక్షణ కార్యక్రమం

మానకొండూర్: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాటమయ్య రక్షణ కవచంపై శనివారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మ్యాడగోని బుచ్చయ్య, జిల్లా అధ్యక్షుడు కత్తి ప్రభాకర్‌గౌడ్ హాజరై మాట్లాడారు. సాంప్రదాయ వృత్తి విధానాని కొనసాగిస్తూ అనేక మంది గీత కార్మికులు తాటిచెట్టుపై నుంచి కిందపడి మృతి చెందడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్నిగ్రామాల్లోని వివిధ సొసైటీల్లోని మెంబర్లకు సేఫ్టీమోకులు ఉచితంగా అందించి ప్రమాదాలను నివారించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు బండి చంద్రయ్యగౌడ్, నాగుల వెంకన్న, బండి నాంపెల్లి, పోషమల్లు, పర్శరాములు, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ



ప్లేట్లు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం జ్యోతిరాణి

హుజూరాబాద్: పట్టణంలోని ప్రతాపవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు శనివారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్, పాఠశాల హెచ్‌ఎం పంజాల జ్యోతిరాణి, టీచర్ సత్యరాజ్, పేరెంట్స్ శ్రీలత, రజిత, స్వప్న, సంపత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనృసింహస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



చొప్పదండి: వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కమనీయం నృసింహుని తిరుకల్యాణోత్సవం

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీకాలనీలోని స్వయంభు శ్రీతాపాల లక్ష్మీనృసింహస్వామి అధ్యాయన బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తిరునగిరి వెంకటాద్రిస్వామి ఆధ్వర్యంలో అర్చకులు లక్ష్మీ వర్దన్, హర్షవర్దన్, కిరణ్‌కుమార్, భాను, చిమిరాల రామకృష్ణ, సౌమిత్రి రామానుజాచార్య కల్యాణం జరిపించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కుంకుమ పూజతో స్వామివారి కల్యాణోత్సవం ముగించారు. ఆలయ కమిటీ తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. 19న శకటోత్సవం నిర్వాహిస్తామని తెలిపారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వివిధ జిల్లాల భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి ఎల్లారెడ్డి, గుంటుక కనకయ్య, అడిషర్ల తిరుపతి, మడుపు శ్రీనివాస్ రెడ్డి, రామిడి మల్లారెడ్డి, గూడ కమలాకర్, ఎర్రం సాగర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





నృసింహస్వామి కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు

ఘనంగా వేంకటేశ్వర కల్యాణం

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏటా శ్రావణ మాసంలో నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు పాలోజు చరణాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం అభిషేకం, ఉత్సవ మూర్తులకు కల్యాణ ఘట్టం, మధ్యాహ్నం అన్నప్రసాదం వితరణ, రాత్రి భజనలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి సత్యానందం, ఉపాధ్యక్షులు మునీందర్, సుధాకర్‌గౌడ్, భాస్కర్, రాములు, సాంబయ్య, రామక్రిష్ణ, రమేశ్ గౌడ్, శ్రవణ్‌కుమార్, నిరంజన్, సత్యం, రాజు, సత్యం, మల్లేశం పాల్గొన్నారు.





మానకొండూర్: నిరసన తెలుపుతున్న వైద్యాధికారులు. శంకరపట్నం: ముత్తారంలో కొవ్వొత్తుల ర్యాలీ

డాక్టర్లకు రక్షణ కల్పించాలి

హుజూరాబాద్: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ శనివారం హుజూరాబాద్ పట్టణంలోని శ్రీనివాస విజన్ సెంటర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సామాజిక వేత్త, కంటి పరీక్ష నిపుణుడు తిప్పారపు శ్రీనివాస్ మాట్లాడారు. వైద్యులు దేవుడితో సమానం, అలాంటి డాక్టర్లకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలన్నారు. అత్యాచారం, హత్యకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్, కేసరి నందన్, మంద సతీశ్, బండారి కిష్టయ్య, కొల్లిపాక శంకర్, తిరుపతి, మండల్ సుస్మిత, స్వాతి పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఆరోగ్య కేంద్రం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మికుంట: ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య హేయమైన చర్య అని జమ్మికుంట ట్రస్మా అధ్యక్షుడు పూల్లూరి సంపత్‌రావు అన్నారు. పట్టణంలోని గాంధీ చౌక్‌వద్ద ట్రసా, ఐఎంఏ ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పట్టణంలో ఐఎంఏ వైద్యులు 24 గంటలు ఓపీ సేవలు నిలిపివేశారు. దారుణానికి పాల్పడిన కిరాతకులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సేవ్ గర్ల్, ఉమెన్ అంటూ నినాదాలు చేశారు. ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్లు ప్రతాపరెడ్డి, తిరుపతిరెడ్డి, బెన్ని, రమణారెడ్డి, సునీల్, రహమాన్, వైద్యులు పాల్గొన్నారు.



గన్నేరువరం: చొక్కారావుపల్లెలో ...

గన్నేరువరం: చొక్కారావుపల్లె గ్రామస్తులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఇలాంటి ఘనటలు పునరావృతం కాకుండా ప్రభుత్వ చట్టాలను కఠినం చేయాలన్నారు. కళ్యాణ్, శేఖర్, పోచయ్య, మహేష్, దేవరాజ్, అనూష, శ్రవంతి, మమత, కీర్తన, అజయ్, తిరుపతి, హారీష్, ఎల్లయ్య పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని ముత్తారం గ్రామంలో శనివారం రాత్రి యువకులు కొవ్వత్తుల ర్యాలీ తీసి నివాళి అర్పించారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

● **ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం**

హుజూరాబాద్‌రూరల్: దేశ సేవలో ఎన్‌సీసీ విద్యార్థులు భాగస్వాములు కావాలని కమెడింగ్ ఆఫీసర్ డానియల్ లైటిజమ్ అన్నారు. మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ముగింపు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశానికి సేవ చేసే భాగ్యం ఎన్‌సీసీ ద్వారా లభిస్తుందని, శిక్షణలో నేర్చుకున్న అంశాలపై సాధన చేయాలన్నారు. విద్యార్థులు అవకాశాలను జారవిడుచుకోవద్దని సూచించారు. శిక్షణా శిబిరాలకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కందుకూరి శంకర్, ఎన్‌సీసీ అధికారి కల్లెం రవీంద్ర బాబు, సుబేదార్ మేజర్ సాగర్ సింగ్ పాల్గొన్నారు.

● **పాడిగేదెల పెంపకంతో ఆదాయం**

శంకరపట్నం: పాడిగేదెల పెంపకంతో అధిక ఆదాయం వస్తుందని పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ అన్నారు. కేశవపట్నం రైతువేదికలో శనివారం ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో పాడిగేదెల పెంపకంపై మహిళా రైతులు, మహిళా సంఘాల్లోని సభ్యులకు శిక్షణ ఇచ్చారు. పాడి గేదెల కొనుగోళ్లకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

● **భూ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి**

చొప్పదండి: పట్టణంలోని బ్రాహ్మణి కుంట శిఖం భూమి ఆక్రమించినవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ నవీన్ కుమార్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. కపలువురు ప్రజాప్రతినిధులు అక్రమంగా పట్టాలు చేసుకున్నారని ఆరోపించారు. గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు కానీ ఇప్పటివరకు చర్యలు తీసుకోవడంలేదని వాపోయారు. అక్రమంగా పట్టాలు పొందుతున్న వారిపై చర్యలు తీసుకోకుంటే పోరాటం చేస్తామన్నారు.

● **ఇసుక ట్రాక్టర్ పట్టివేత**

జమ్మికుంట: ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పట్టణంలోని ఎఫ్‌సీఐ వద్ద ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొమిరే రవి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నండగా పట్టుకొని కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

● **చికిత్స పొందుతూ యువకుడు మృతి**

మానకొండూర్: శంకరపట్నం మండలం ముత్తారంకు నాయిని వినోద్ కుమార్ (34) మానకొండూర్ మండలం పచ్చునూర్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ సదన్‌కుమార్ తెలిపిన వివరాలు .. ప్రైవేటు కంపెనీల్లో ఇంజినీర్‌గా పనిచేస్తున్న వినోద్ కుమార్‌కు పచ్చునూర్‌కు చెందిన నిఖితతో 4 సంవత్సరాల క్రితం వివాహమైంది. 17 రోజుల క్రితం కొడుకు పుట్టాడు. 14న అత్తగారింటికి వచ్చి శుక్రవారం కరీంనగర్‌లోని ఆసుపత్రిలో కుమారుడుని చూపించిన అనంతరం భార్య, కుమారుడిని ఇంటికి పంపించి బైక్‌పై పచ్చునూర్‌కు వెళ్లాడు. సమ్మయ్యకు చెందిన కొట్టంలో పురుగు మందు తాగినట్లు కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వినోద్‌కుమార్‌కు మతిస్థిమితంగా లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడని, కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు ద ర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

● **కోర్టు ఆదేశాలతో కేసు నమోదు**

వీణవంక: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ఆరుగురిపై హుజూరాబాద్ కోర్టు ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్నాల తిరుపతి భూమిలో పశువుల మేత కోసం వరి గడ్డిని పాగు చేయగా ఆరుగురు ధ్వంసం చేశారు. ఎందుకు ధ్వంసం చేశారని తిరుపతి ప్రశ్నించగా చంపుతామని బెదిరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకోకపోవడంతో కోర్టును ఆశ్రయించినట్లు బాధితుడు తిరుపతి తెలిపారు.

● **బురదరోడ్డుతో ఇబ్బందులు**

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామ పరిధిలోని బంజేరుపల్లి మట్టిరోడ్డుపై వర్షాకాలంలో బైక్, సైకిళ్లపై వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. మరమ్మతులు చేసేవారు కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌కు పలుమార్లు విన్నవించినా ఫలితంలేకుండాపోయిందని గ్రామస్తులు వాపోయారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సైతం వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు.

'మొలంగూర్'ను విభజించవద్దు



డీఆర్‌వోకు వినతిపత్రం అందిస్తున్న గణేశ్

శంకరపట్నం: ప్రాచీన చరిత్ర ఉన్న మొలంగూర్ గ్రామ పంచాయతీ నుంచి అనుబంధ గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా చేయొద్దని యువ జన సమితి రాష్ట్రకార్యదర్శి మోరె గణేశ్ జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందించారు. మొలంగూర్‌ఖిల్లా, దూద్‌బావి చరిత్ర ఉందని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. ఇప్పటికే మొలంగూర్ నుంచి ముక్త గ్రామపంచాయతీగా చేయడంతో నిధులు లేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. నల్లవెంకయ్యపల్లి, గుడాటిపల్లి అనుబంధ గ్రామాలను జీపీలుగా చేస్తే జనాభా పరంగా నిధుల కొరత ఏర్పడుతుందన్నారు.

బాధ్యతలు స్వీకరణ

హుజూరాబాద్: హుజూరాబాద్ మండల వ్యవసాయ అధికారిగా చాడ భూమిరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన చందుపట్ల సునీల్‌కుమార్ హన్మకొండ జిల్లా ఐనవోలు మండలానికి బదిలీపై వెళ్లగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నుంచి భూమిరెడ్డి బదిలీపై వచ్చారు. భూమిరెడ్డికి అధికారులు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఏఈఓలు పొద్దుటూరి సతీష్, నరేష్, శివరాం, సీనియర్ సహాయకులు రవీందర్‌సింగ్ ఉన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల వ్యవసాయ అధికారిగా ముప్పిడి సూర్యనారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏవోగా పని చేసిన గుర్రం రజిత హుజూరాబాద్ ఏడీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

సన్మానం

శంకరపట్నం: బదిలీపై వెళ్లిన మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను కేశవపట్నం రైతు వేదికలో శనివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు బస్వయ్య, కార్యదర్శి నర్సయ్య పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని బొంతుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన జానపట్ల అనిత బదిలీపై వెళ్లగా మాజీ ఉప సర్పంచ్ చదువు జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సంపత్, నాగయ్య, వెంకట్‌కుమార్, గ్రామ ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎల్‌ఎంగా పదోన్నతి

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో జేఎల్‌ఎంగా పనిచేస్తూ ఏఎల్‌ఎంగా పదోన్నతి పొందిన వల్లపు పృథ్వీరాజ్‌ను శనివారం గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుండి ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్నేహితుల కుటుంబాలకు ఆర్థికసాయం

ఇల్లందకుంట: మండల కేంద్రానికి చెందిన బొడ్డు శ్రీనివాస్ రోడ్డుప్రమాదం, గన్ను శ్రీనివాస్ కరెంట్‌షాక్‌తో ఇటీవల మృతిచెందారు. మృతుల స్నేహితులు 1996–97 పదో తరగతికి చెందినవారు మేమున్నామంటూ ముందుకువచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ.25వేలు అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పరామర్శ

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణానికి చెందిన తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ రమేశ్ అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శనివారం రమేశ్ అంత్యక్రియలో పాల్గొన్నారు. అండగా ఉంటానని రమేశ్ కుటుంబ సభ్యులకు భరోసా ఇస్తూ రూ. 50 వేలు అందజేశారు. కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర అధ్యక్షుడు రజినీకుమార్, వివిధ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సర్వపిండి.. తినొద్దాం రండి



సర్వపిండి ఇస్తున్న సాంబమూర్తి



సర్వపిండి తయారు చేస్తున్న సాంబమూర్తి, ప్రవీణ్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం సర్వపిండికి స్పెషల్‌గా పేరు గాంచింది. ఎన్నో ఏళ్లుగా హోటళ్లు నిర్వహించిన వారిలో కొందరు ప్రస్తుతం సర్వపిండి తయారు చేస్తూ అల్పాహారప్రియులను ఆకట్టుకుంటున్నారు. బియ్యం పిండి, వేరుశనగతో తయార్యే ఈ రుచికరమైన ఆహారపదార్థాన్ని ఇష్టపడే వారి సంఖ్య అధికమే. ఆయా ప్రాంతాల్లో ఒక్కోపేరుతో పిలుస్తారు. వరంగల్‌లో తప్పల చెక్క, సిద్దిపేటలో సర్వపిండి, గుండ్రటి ఆకారపు గిన్నెలో తయారు చేస్తారు కాబట్టి గిన్నప్ప అని కూడా అంటారు. వరంగల్ జిల్లాలోని ఓ గ్రామం నుంచి ఈ వంటకం ఉద్భవించి చివరికి తెలంగాణ వ్యాప్తంగా పాపులర్ అయింది. కేశవపట్నంలో రోజూ మధ్యాహ్నం 12 గంటలకు సర్వపిండి తయారీకి కావాల్సిన ఆహారపదార్థాలను సిద్ధం చేసుకొని సాయంత్రానికి సర్వపిండి తయారు చేసి భోజన ప్రియులకు అందిస్తున్నారు. వరిపిండి, నువ్వులు, పల్లీలు, కరివేపాకు, కొత్తిమీర, ఉల్లిఆకు, పచ్చిమిర్చిల మిశ్రమాన్ని కలిపి గుండ్రటి గిన్నెలో నూనె పోసి అట్టలా వేస్తారు. సర్వపిండి టమాట, పూదిన చట్నీ అందిస్తుండడంతో రుచికరంగా ఉందంటూ మండల ప్రజలే కాకుండా వాహనదారులు, చుట్టు పక్కల మండలాల ప్రజలు లొట్టలేసుకుంటూ భుజిస్తారు, మరికొందరు పార్శిళ్లు కట్టించుకొని మరీ తీసుకెళ్తున్నారు.

శని, ఆదివారాల్లో

ప్రతిరోజు 150 నుంచి 200 వరకు తయారు చేసి విక్రయిస్తుండగా శని, ఆదివారాల్లో వేములవాడ, కరీంనగర్ నుంచి వరంగల్ వెళ్లేవారు అధికంగా కొనుగోలు చేస్తుంటారు. ఈ రెండు రోజుల్లో అదనంగా విక్రయిస్తుంటారు.

నమ్మకంతో ఆర్డర్లు



పదిహేడేళ్లపాటు అన్నతో కలిసి హోటల్ నడిపిన. ఏడేళ్లుగా కేవలం సర్వపిండిని రుచికరంగా తయారు చేసి అందిస్తుండటంతో నమ్మకంతో ఆర్డర్లు ఇస్తున్నారు. కరీంనగర్, వేములవాడ నుంచి గిరాకీ ఎక్కువగా ఉంటుంది.

– సాంబమూర్తి, టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు

ప్రైవేట్ ఉద్యోగం మానేశాను



పీజీ వరకు చదివి ప్రైవేట్ ఉద్యోగం చేశాను. వచ్చే జీతంతో సంతృప్తి లభించ లేదు. కరోనా సమయంలో ఉద్యోగం లేకపోవడంతో తల్లిదండ్రులతో కలిసి సర్వపిండి తయారుచేస్తున్నాను. రోజు 150 నుంచి 200 వరకు విక్రయిస్తున్నాం.

– ప్రవీణ్, టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

• ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

గన్నేరువరం: వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సేవా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుండ్లపల్లి రైతువేదికలో నిర్వహించిన రక్తదాన, హెల్త్ క్యాంపును ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తున్న సేవా యూత్ ఫౌండేషన్‌ను అభినందించారు. గ్రామాల్లోని క్యాంపులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఫౌండేషన్ సేవలను గుర్తించిన బీఆర్‌ఎస్ నాయకుడు విక్రమ్‌రెడ్డి, రూ.ఐదువేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో కిరణ్మయి, నాయకులు బేతెల్లి రాజేందర్‌రెడ్డి, వంగాల సత్యనారాయణరెడ్డి, గొంటి సంతోశ్‌కుమార్, వైద్యులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్

సైదాపూర్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ అన్నారు. జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి పి. శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు శనివారం మండలంలోని గొడిశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, చైల్డ్ ప్రొటెక్షన్ సోషల్ వర్కర్ రమేశ్, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

కొర్రీలు పెట్టకుండా రుణమాఫీ చేయాలి

గంగాధర: కొర్రీలు పెట్టకుండా ప్రభుత్వం రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతులకు మాఫీ సమాచారం లేక బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు.

హుజూరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుకు సరైన కార్యాచరణ చేపట్టలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో మాట్లాడారు. ఎన్నికల హామీలకు ప్రభుత్వానికి పలు సూచనలు చేస్తున్నామని, హామీలు పూర్తిస్థాయిలో నెరవేర్చే వరకు ప్రజల తరపున పోరాటం చేస్తా మన్నారు. రూ.రెండు లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. షరతులు లేకుండా ప్రతి రైతుకు చేయాలని రుణమాఫీ డిమాండ్ చేశారు.

రుణమాఫీపై శ్వేత పత్రం విడుదల చేయాలి

జమ్మికుంట: ఏక కాలంలో రుణమాఫీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేసిందని, రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలో బీజేపీ నేతలతో కలిసి మాట్లాడారు. రుణమాఫీపై ప్రకటనల పేరుతో ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి మాట తప్పారన్నారు.

జమ్మికుంట: జమ్మికుంట పీఏసీఎస్) పరిధిలో 102 మంది రైతులకు రెండు లక్షల రుణమాఫీ అయిందని, మిగతా రైతులకు ఈ నెల 30వ తేదీ వరకు అవుతుందని ఎవరూ ఆందోళన చెందొద్దని పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ శనివారం ప్రకటనలో తెలిపారు.



రామడుగు: అల్ఫోర్స్ స్కూల్లో రక్షాబంధన్



హుజూరాబాద్‌రూరల్: తుమ్మనపల్లి ఏకశిలలో..

ముందస్తు రక్షాబంధన్

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలు, కాలేజీల్లో పలు గ్రామాల్లో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ముందస్తు రక్షాబంధన్ నిర్వహించారు. బాలికలు బాలురకు రాఖీలు కట్టారు. స్వీట్లు పంపిణీ చేసుకొని సంబరాలు నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లో బీజేపీ నాయకులు రాఖీలు పంపిణీ చేశారు.